




TGTEL/25/A31

# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :152 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ సోమవారం- 29 - జూన్- 2026


## సౌదీలో ఘోర ప్రమాదం.. హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది దుర్మరణం



- సౌదీ అరేబియాలో కుప్పకూలిన అరామ్కో హెలికాప్టర్
- ప్రమాదంలో 14 మంది సౌదీ పౌరులు మృతి
- రస్ తనూరా తీరంలో ఆదివారం ఉదయం ఈ ఘటన
- ప్రమాద కారణాలపై సౌదీ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశం
- మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ సంతాపం

## పాకిస్థాన్‌కు
# భారత్ స్ట్రాంగ్ కౌంటర్

- కరాచీ దాడిలో భారత్ హస్తం ఉందన్న పాక్ ఆరోపణలను ఖండించిన భారత్
- నిరాధార ఆరోపణలు మానుకుని ఉగ్రవాద స్థావరాలపై చర్యలు తీసుకోవాలని సూచన



ఢిల్లీ : పాకిస్థాన్‌లోని కరాచీలో జరిగిన ఉగ్రదాడి వెనుక భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఇతర దేశాలపై వేలెత్తి చూపే బదులు, పాకిస్థాన్ తన భూభాగంలో పెరిగిపోతున్న ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మీడియా ప్రశ్నలకు స్పందించిన రణధీర్ జైస్వాల్, కరాచీ ఘటనకు సంబంధించి భారత్‌పై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. వాటిని భారత్ పూర్తిగా తిరస్కరిస్తోందని స్పష్టం చేశారు. ఇతరులపై నిందలు వేయడం కంటే పాకిస్థాన్ మిగతా..2లో

## నాకు చావంటే భయం లేదు
# ఈ ఏడాదే బంగ్లాదేశ్‌కు వెళ్తాను

- బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులను ఖండించిన ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా
- ఈ ఏడాదే తాను బంగ్లాకు తిరిగి వెళ్తానని ప్రకటన
- తమ పార్టీ అవామీ లీగ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తేయాలని డిమాండ్

**మాజీ ప్రధాని షేక్ హసీనా**



ఢిల్లీ : తీవ్ర రాజకీయ సంక్షోభం ఏర్పడి తన స్వదేశాన్ని వీడి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాదే తాను బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోతానని ప్రకటించారు. తమ పార్టీ అవామీ లీగ్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక శక్తి అని పేర్కొన్నారు. మైనారిటీలపై జరిగిన ఎలాంటి దాడి అయినా బంగ్లాదేశ్ స్వాతంత్ర్యంపై దాడితో సమానమని స్పష్టం చేశారు. ఓ జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**అధికారం కోసం రాజకీయాలు చేయను : షేక్ హసీనా**

తాను బంగ్లాకు తిరిగి వెళ్లడమనేది మిగతా..2లో

## ప్రతి చిన్నారికి పోలియో
# చుక్కలు తప్పనిసరి



- ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు.
- పోలియో రహిత తెలంగాణ లక్ష్యంగా తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

హైదరాబాద్, జూన్ 28 : ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని

## నల్గొండలో హ్యామ్ రోడ్ల ప్రాజెక్టులకు
# సీఎం రేవంత్ శ్రీకారం

- నల్గొండ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్లతో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ రహదారుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.
- ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని ప్రధాన రహదారుల అనుసంధానం మెరుగుపడటంతో పాటు రవాణా వ్యవస్థ మరింత వేగవంతం కానుంది.



నల్లగొండ, జూన్ 28: తెలంగాణలో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా కనగల్ ఏఎంసీ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(నావీ) రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భారీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, బాలు నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 34 ప్యాకేజీల్లో 6,092 కిలోమీటర్ల మేర 441 రహదారులను హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని ప్రధాన రహదారుల అనుసంధానం మెరుగుపడటం సహా రవాణా వ్యవస్థ మరింత వేగవంతం కానుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మిగతా..2లో

## ఆ సినిమా టైటిల్ కు అర్థం ఏమిటో
# పవన్ కల్యాణ్ ను అడగండి

- 'ఇడుపు కాయితం' టైటిల్‌పై రాజుకున్న వివాదం
- అర్థం తెలియాలంటే పవన్‌ను అడగాలన్న కవిత
- తెలంగాణ యాసను రేవంత్ రెడ్డి కాపాడటం లేదని విమర్శ
- ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు
- తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన



హైదరాబాద్ : టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇడుపు కాయితం' అనే సినిమా టైటిల్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, ఆ పదానికి అసలైన అర్థం తెలియాలంటే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అడగాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉప్పల్‌లో తన పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేగుతోంది. ముఖ్యంగా కొందరు ఆంధ్ర నెటిజన్లు తెలంగాణ యాసను, ఈ పదాన్ని కించపరిచేలా ట్రోల్ చేస్తుండటం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కవిత స్పందిస్తూ, తెలంగాణ భాష, అస్తిత్వంపై దాడి జరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ, చివరికి సొంత పార్టీ బీఆర్ఎస్ కూడా మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "రాష్ట్రంలో మరోసారి ఉద్యమకాలం నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. మిగతా..2లో

## శ్రీవారి సేవలో అనంత్ అంబానీ.. టీటీడీకి రూ.27.5 కోట్ల భారీ విరాళం



- తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంత్ అంబానీ
- టీటీడీకి రూ.27.5 కోట్లతో 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ప్రకటన
- బస్సుల నిర్వహణ, డ్రైవర్ల జీతాలు కూడా తామే భరిస్తామని వెల్లడి

ఢిల్లీ : ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ నేడు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీకి భారీ విరాళం ప్రకటించారు. తిరుమల ఘాట్ రోడ్లలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రూ.27.5 కోట్ల వ్యయంతో 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇవాళ తెల్లవారుజామున ఆలయానికి చేరుకున్న అనంత్ అంబానీ, శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. మిగతా..2లో

## ద్రోణి ప్రభావంతో ఏపీలో మారిన వాతావరణం..రెండు రోజులు మోస్తరు నుండి భారీ వర్షాలు!



- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని
- రాయలసీమ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉండి, కొన్ని చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలకు తోడు ఉపరితల ద్రోణి తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ద్రోణి ప్రభావం కారణంగా రాబోయే మరో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా రేపు (సోమవారం) ఉత్తర మరియు మిగతా..2లో

## జనసంద్రమైన స్వర్ణాల చెరువు
### మూడో రోజు రొట్టెల పండగకు పోటెత్తిన భక్తులు



- మూడో రోజు కోలహలంగా రొట్టెల పండగ
- స్వర్ణాల చెరువు వద్ద నెలకొన్న భక్తుల కోలాహలం
- దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

అమరావతి : నెల్లూరు స్వర్ణాల చెరువు మూడోరోజూ భక్త జనసంద్రంగా మారింది. కీలక ఘటమైన గంధమహోత్సవం శనివారం అర్ధరాత్రి జరగ్గా జనం పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో దర్గాకు వచ్చే దారులన్నీ రద్దీగా మారాయి. ఇవాళ సెలవు దినం కావడంతో బారాషాహీదుల దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఉద్యోగం, సంతానం, వివాహం రొట్టెలకు డిమాండ్ ఏర్పడింది. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. నెల్లూరు బారాషాహీద్ దర్గా రొట్టెల పండగకు

## సంతానం భారం కాదు, సంపద - పిల్లల పెంపకంలో
# తండ్రి బాధ్యత తీసుకోవాలి

- రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా పల్స్ పోలియో కార్యక్రమం
- చిన్నారులకు పోలియో చుక్కలు వేసి తల్లిదండ్రులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు
- పరిస్థితులు మారాయి - ఇప్పుడు సంతానం భారం కాదు సంపదన్న సీఎం



మిగతాది 2లో

అమరావతి : జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు, మార్కెట్లు వంటి రద్దీ ప్రదేశాల్లో పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ క్రమంలోనే తన క్యాంప్ కార్యాలయంలో పిల్లలకు సీఎం చంద్రబాబు పోలియో చుక్కలు వేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని చంద్రబాబు కొంతసేపు ఆడించారు. వారి ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులుతో సీఎం మాట్లాడారు. పిల్లల పెంపకం భారంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు.

## ప్రభుత్వ బడుల్లో స్మార్ట్ కిచెన్లు - జగన్ ఆరోపణలపై మంత్రి లోకేశ్ తీవ్ర విమర్శలు

- స్మార్ట్ కిచెన్లపై రాజకీయ విమర్శలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వేతనాలపై ఆరోపణలు నిరాధారమన్న మంత్రి లోకేశ్



అమరావతి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రత, నాణ్యత, రుచితో కూడిన మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్లపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో విమర్శించడం తగదని ఆయన పేర్కొన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం అందుతుండగా, వేలాది మంది మహిళలు, పేదలకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నాయని చెప్పారు. కడపలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం : వైఎస్సార్ కడప జిల్లాలో ఐదు స్మార్ట్ కిచెన్లను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు లోకేశ్ తెలిపారు. ఈ కిచెన్ల పరిధిలో ఇప్పటికే పనిచేస్తున్న 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా తమ విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల ఉపాధికి ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. కొత్త కిచెన్లతో మరిన్ని ఉద్యోగాలు : జిల్లాలో మరో 33 స్మార్ట్ కిచెన్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి లోకేశ్ వెల్లడించారు.

### మొదటి పేజీ తరువాయి

## సంతానం భారం కాదు, సంపద
# పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యత తీసుకోవాలి

ఉద్యోగానికి, ఉపాధికి వెళ్తున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చిన్నారుల్ని కని, పెంచడం, వారి అలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని తెలిపారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని గుర్తుచేశారు. వారిని విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని అలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని చంద్రబాబు తెలిపారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని చెప్పారు. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని వెల్లడించారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

## శ్రీవారి సేవలో అనంత్ అంబానీ..
# టీటీడీకి రూ.27.5 కోట్ల భారీ విరాళం

టీటీడీ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులతో సమావేశమైన అనంత్ అంబానీ, తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీలోనే ఆయన భారీ విరాళంపై ప్రకటన చేశారు. కేవలం ఎలక్ట్రిక్ బస్సులను అందించడమే కాకుండా వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈ బస్సులను నడిపే డ్రైవర్ల జీతభత్యాలను సైతం పూర్తిగా రిలయన్స్ సంస్థే భరిస్తుందని స్పష్టం చేశారు. అనంత్ అంబానీ తీసుకున్న ఈ నిర్ణయంపై టీటీడీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 26 గంటల సమయం పడుతోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సోమవారం నాటి వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు శ్రీవాణి దర్శనాలను కూడా రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది.

## నల్గొండలో హ్యామ్ రోడ్ల ప్రాజెక్టులకు సీఎం రేవంత్ శ్రీకారం

మధ్య ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడి ఆర్థిక కార్యకలాపాలకూ ఊతమిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.83 కోట్ల వ్యయంతో చేపట్టనున్న డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్-1 పనులకు శంకుస్థాపన చేశారు. నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా రహదారులు, తాగునీటి వంటి మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ కార్యక్రమాలు స్పష్టం చేస్తున్నాయి.

## ఆ సినిమా టైటిల్ కు అర్థం ఏమిటో
# పవన్ కల్యాణ్ ను అడగండి

అప్పుడు మనల్ని, మన భాషను ఎలా అయితే అవాకులు చెవాకులు పేలారో, ఇప్పుడు మళ్లీ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనమందరం ఈ విషయాన్ని గమనించుకోవాలి. నిన్నగాక మొన్న 'ఇడుపు కాయితం' అనే పేరుతో ఒక సినిమా వచ్చింది. ఈ పేరు అర్థం కావడం లేదంటూ కొందరు దానిపై ట్రోలింగ్ చేస్తున్నారు. తెలంగాణ యాసను అవమానించడమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. నేను ఒకటే సూటిగా అడుగుతున్నా... 'ఇడుపు కాయితం' అంటే అర్థం తెలియకపోతే, వెళ్లి సినిమా నటుడు పవన్ కళ్యాణ్‌ను అడగండి. ఆయనకు ఆ పదం అర్థం బాగా తెలుసు, కచ్చితంగా వివరిస్తారు. మా భాషను, యాసను అవహేళన చేసినందుకే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. ఇంకోసారి ఇటువంటి వెకిలి ప్రయత్నాలు చేయకండి. ఒకరి భాషను ఒకరం, ఒకరి సంస్కృతిని ఒకరం గౌరవించుకుందాం. అందరం కలిసే ఉందాం. కానీ, తెలంగాణను అవమానిస్తాం, మా భాషను కించపరుస్తాం అంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఈరోజు తెలంగాణ భాషను ఇంతగా కించపరుస్తున్నా కాంగ్రెస్ పార్టీ నోరు మెదపదు. ఎందుకంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేదు. ఇక బీజేపీ సంగతి సరేసరి. దేశంలోని సమస్యలు తప్ప, తెలంగాణ గురించి వారికి పట్టదు. బీఆర్ఎస్ పార్టీ కూడా మాట్లాడదు. ఎందుకంటే, అందులో ఓ గుంటనక్క ఉంది. ఆయన వ్యాపారాలన్నీ ఇప్పటికీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారితోనే ముడిపడి ఉన్నాయి" అని ఆరోపించారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి


తల్లిదండ్రులకు తెలంగాణ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. పోలియో రహిత తెలంగాణ లక్ష్యంగా తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది విస్తృత చర్యలు చేపడుతున్నారని వివరించారు. బోరబండ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈరోజు(ఆదివారం) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ద్రోణి ప్రభావంతో ఏపీలో మారిన వాతావరణం..
## రెండు రోజులు మోస్తరు నుండి భారీ వర్షాలు!

దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు, తీవ్రమైన ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వానలు పడే అవకాశం ఉంది. అదే సమయంలో రాయలసీమ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉండి, కొన్ని చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తీరప్రాంతం మరియు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. వర్షాల సమయంలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉంది. ఈ క్రమంలోనే ప్రజలకు అత్యంత కీలకమైన భద్రతా మార్గదర్శకాలను జారీ చేసింది. ఆకాశంలో ఉరుములు, మెరుపులు కనిపించినా లేదా శబ్దాలు వినిపించినా వెంటనే అప్రమత్తం కావాలని హెచ్చరించింది. పిడుగులు పడే ముప్పు ఎక్కువగా ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు బయట ఉండకూడదని స్పష్టం చేసింది. ముఖ్యంగా ప్రయాణాల్లో ఉన్నవారు ఉరుములు రాగానే పెద్ద పెద్ద చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, పాత పడిపోయేలా ఉన్న హోర్డింగుల (ఫ్లెక్సీల) వద్ద ఆశ్రయం పొందకుండా, వెంటనే సురక్షితమైన శాశ్వత భవనాల్లోకి వెళ్లాలని అత్యవసర సూచనలు చేసింది. తాజా వాతావరణ అప్‌డేట్ల కోసం ప్రజలు స్థానిక యంత్రాంగం మరియు వార్తా ఛానళ్లను గమనిస్తూ ఉండాలని అధికారులు కోరారు.

## మానస్ సరోవర్ యాత్రకు వెళ్లే భారతీయులకు కేంద్రం అడ్వైజరీ

**ప్రైవేటు టూర్ ఆపరేటర్లపై ఆధారపడి వెళ్లే భక్తులకు కేంద్రం కీలక సూచన- ప్రయాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన అన్ని పత్రాలు పొందిన తర్వాతే భారత్ నుంచి బయల్దేరాలని సూచన**



ప్రైవేటు టూర్ ఆపరేటర్లపై ఆధారపడి కైలాస-మానస్ సరోవర్ యాత్రకు వెళ్తున్న భారతీయ పౌరులకు విదేశాంగ శాఖ అడ్వైజరీ జారీ చేసింది. ఈ మొత్తం ప్రయాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన అన్ని పత్రాలు పొందిన తర్వాతే భారత్ నుంచి బయల్దేరాలని సూచించింది. చైనాలోకి ప్రవేశించడానికి అవసరమైన పర్మిట్, వీసాలు లేకుండా ప్రైవేటు టూర్ ఆపరేటర్లను నమ్మి వెళ్లి పలువురు భారతీయ యాత్రికులు నేపాల్‌లో చిక్కుకుపోయారు. సహాయం చేయాలంటూ వారి నుంచి అభ్యర్థనలు వచ్చిన నేపథ్యంలో కేంద్రం ఈ మేరకు స్పందించింది. యాత్ర ప్రారంభించడానికి ముందు టూర్ ఆపరేటర్ వివరాలను ధ్రువీకరించుకోవాలని చెప్పింది. "ప్రైవేట్ టూర్ ఆపరేటర్ల ద్వారా కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్తూ, చైనాకు అవసరమైన ప్రవేశ అనుమతి, వీసాలు లేకుండా నేపాల్‌లో చిక్కుకుపోయిన భారతీయ పౌరుల నుంచి సహాయం కోరుతూ అనేక అభ్యర్థనలు మాకు అందాయి. పూర్తి యాత్రకు అవసరమైన ప్రయాణ పత్రాలన్నీ పొందే వరకు భారతదేశం నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించవద్దని పౌరులకు సూచిస్తున్నాం. ధ్రువీకరించిన పత్రాలు లేకుండా లేదా అవసరమైన పత్రాలు భవిష్యత్తులో లభిస్తాయనే అంచనాతో ప్రయాణాన్ని ప్రారంభించడం వల్ల చిక్కుకుపోయే ప్రమాదం ఉంది. తమ టూర్ ఆపరేటర్ సరైన విధంగా నమోదు చేసి, అధికారిక అనుమతి కలిగి ఉన్నారో లేదో సరిచూసుకోవాలని యాత్రికులకు సూచిస్తున్నాం.

భారత విదేశాంగ శాఖ ప్రకటన

నేపాల్‌లో చిక్కుకుపోయిన భారతీయ యాత్రికులకు సహాయం చేయాలంటూ ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే కేంద్రాన్ని నేపాల్, చైనాలోని భారత ఎంబసీలను ఎక్స్ వేదికగా కోరారు. 52 మంది భారత పౌరులు చిక్కుకున్నారని ఆమె తెలిపారు. ఈ క్రమంలోనే స్పందించిన కేంద్రం భారత పౌరులకు అడ్వైజరీ జారీ

# ప్రభుత్వ బడుల్లో స్మార్ట్ కిచెన్లు - జగన్ ఆరోపణలపై మంత్రి లోకేశ్ తీవ్ర విమర్శలు

### మొదటి పేజీ తరువాయి



వీటి ద్వారా ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలతో పాటు అదనంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు కొత్తగా ఉద్యోగాలు లభించనున్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ కిచెన్ల విస్తరణతో వేలాది మందికి ఉపాధి కల్పించే అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. వేతనాలపై ఆరోపణలు నిరాధారం : స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో పనిచేస్తున్న కుక్-కమ్-హెల్పర్లకు వేతనాలు చెల్లించలేదన్న ఆరోపణలను కూడా లోకేశ్ ఖండించారు. వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న మొత్తం 3,450 మంది కుక్-కమ్-హెల్పర్లకు 2026 ఏప్రిల్ నెల వరకు గౌరవ వేతనాలు పూర్తిగా చెల్లించినట్లు తెలిపారు. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో ఆ నెలకు గౌరవ వేతనాల చెల్లింపు ఉండదని స్పష్టం చేశారు. జూన్ నెల ఇంకా పూర్తికాకముందే బకాయిలపై ఆరోపణలు చేయడం వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. జగన్ ఎవరి బకాయిలు గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం లక్ష్యం : స్మార్ట్ కిచెన్ల ప్రధాన ఉద్దేశ్యం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందించడమేనని మంత్రి వివరించారు. ఆధునిక వంటశాలల ద్వారా ఆహార నాణ్యత మెరుగుపడటం ఉంటుందని చెప్పారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా వారి విద్యాభ్యాసంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. జగన్‌పై లోకేశ్ ప్రశ్నలు : పేద పిల్లలకు మంచి ఆహారం అందించడం, మహిళలకు ఉపాధి కల్పించడం కూడా సహించలేకపోతే ఎలా అని మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను లోకేశ్ ప్రశ్నించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై తప్పుడు ఆరోపణలు చేయకుండా, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని ఆయన అన్నారు.

# సౌదీలో ఘోర ప్రమాదం.. హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది దుర్మరణం

### మొదటి పేజీ తరువాయి



ఢిల్లీ : సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ప్రభుత్వ రంగ దిగ్గజ చమురు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని సౌదీ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇంధన మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ధ్రువీకరించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ప్రమాదంపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. అయితే, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రస్ తనూరా ప్రాంతం సౌదీ ఇంధన రంగానికి అత్యంత కీలకం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్స్‌లో ఒకటి ఇక్కడే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా దాదాపు నాలుగు నెలల పాటు నిలిచిపోయిన కార్యకలాపాలు ఈ శుక్రవారమే ఇక్కడ తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రమాదం జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# జనసంద్రమైన స్వర్ణాల చెరువు - మూడో రోజు రొట్టెల పండగకు పోటెత్తిన భక్తులు

### మొదటి పేజీ తరువాయి



పలువురు ఎమ్మెల్యేలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలో బారాషాహీదులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఎమ్మెల్యే కావాలని కోరుతూ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దంపతులు రొట్టె వదిలారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ మరో రొట్టె పట్టుకున్నారు. 2029లో తన తమ్ముడు గిరిధర్ రెడ్డి ఎమ్మెల్యే కావాలని కోరుతూ రొట్టె వదిలినట్లు ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి తెలిపారు. బారాషాహిద్ దర్గా వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కొనియాడారు. కోర్కెలు నెరవేరాలని : సంతానం కోసం, ఉన్నత చదువులు, గృహం కోసం ఇలా తమ కోర్కెలు నెరవేరాలని భక్తులు స్వర్ణాల చెరువు దగ్గరికి వస్తారు. చెరువులో స్నానం చేసి తమ కోరికలు తీర్చమని దేవుళ్లని వేడుకుంటారు. మరోవైపు కోరిక తీరిన వారు అందుకు గుర్తుగా రొట్టెలు తెచ్చి పంచిపెడతారు. ఆ రొట్టె అందుకున్న వారు తిరిగి తమ కోర్కెలు నెరవేరాక మళ్లీ రొట్టెలను పంచుతారు. ఈ ఆచారం చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది. రొట్టె తీసుకోవడం ఆనవాయితీ : సంపద కావాలనుకునే వారికి ఒక రొట్టె, చదువు, ఉద్యోగం, సొంత ఇల్లు, ఆరోగ్యం, వివాహం, ఇలా ఎవరి కోరికలకనుగుణంగా వారు ఇక్కడ రొట్టె తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఒక ఏడాది ఇక్కడకు వచ్చి రొట్టె తీసుకొని కోరిక తీరిన తర్వాత కచ్చితంగా వచ్చి మళ్లీ రొట్టె విడిచి వెళ్లాలన్నది ఆచారం. అదేవిధంగా బారాషాహీద్‌లకు గలేఫ్‌లు, పూల చద్దర్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. దర్గా పరిసర ప్రాంతాలు, ఘాట్లలో, పార్కింగ్ ప్రదేశాల్లో శానిటేషన్ కు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు కంట్రోల్ రూమ్ ను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు సులువుగా గుర్తించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్వర్ణాల చెరువులో సోమశిల నుంచి నీటిని పెంచారు. రోజుకు మూడు సార్లు బ్లీచింగ్, నీటిలో క్లోరినేషన్ చేస్తున్నారు. 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన వైద్య బృందాలు, 108 అంబులెన్స్ లను అందుబాటులో ఉంచారు. నెల్లూరు రైల్వేస్టేషన్, బస్ స్టేషన్ ల నుంచి స్వర్ణాల చెరువుకు వచ్చేందుకు బస్ సర్వీసులను నడుపుతున్నారు. జల్లు స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు : రొట్టెల పండుగకు వచ్చే భక్తులు జిల్లాలోని కసుమూరు, ఏఎస్ పేట దర్గాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో శానిటేషన్, త్రాగునీటి సౌకర్యం కల్పించారు. రొట్టెల పండుగకు వచ్చే మహిళలు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పరిశుభ్ర వాతావరణంలో స్నానాలకు టెంట్ లు ఏర్పాటు చేశారు. జల్లు స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

# పాకిస్థాన్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్

### మొదటి పేజీ తరువాయి



తనలో తాను ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తమ భూభాగంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించేందుకు విశ్వసనీయ చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంలో భాగంగా ఉపయోగించే ధోరణిని విడనాడాలని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి కరాచీలోని సింధ్ రేంజర్స్ భిట్టాయ్ వింగ్ ప్రధాన కార్యాలయంపై భారీ ఉగ్రదాడి జరిగింది. రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ఆయుధాలతో వచ్చిన ఉగ్రవాదులు వాహనాన్ని ప్రధాన గేటుకు ఢీకొట్టి బలవంతంగా లోపలికి ప్రవేశించారు. అనంతరం గ్రెనేడ్లు విసురుతూ కాల్పులకు తెగబడ్డారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉగ్రవాదుల దాడికి రేంజర్స్ సిబ్బంది వెంటనే ప్రతిదాడి ప్రారంభించారు. అనంతరం స్పెషల్ సెక్యూరిటీ యూనిట్ (ఎస్ఎస్‌యూ), యాంటీ టెర్రరిస్ట్ ఫోర్స్ (ఏటీఎఫ్) కమాండోలు రంగంలోకి దిగడంతో సుమారు 90 నిమిషాల పాటు ఎదురుకాల్పులు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో గాయపడిన ఉగ్రవాదిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అయితే ఈ దాడిలో సింధ్ రేంజర్స్‌కు చెందిన నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఘటన అనంతరం ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. కాల్పుల సమయంలో సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. ప్రజలను ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. ఈ దాడికి నిషేధిత తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చెందిన జమాత్-ఉల్-అహ్రార్ అనే ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించినట్లు ప్రకటించింది. ఈ సంస్థ ప్రధానంగా పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తూ భద్రతా బలగాలు, ప్రభుత్వ సంస్థలు, పౌరులపై దాడులకు పాల్పడుతోంది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, దుండగులు వాహనంతో గేటును ఢీకొట్టి లోపలికి ప్రవేశించి గ్రెనేడ్లు విసిరినట్లు అధికారులు తెలిపారు. ఆ వెంటనే రేంజర్స్ సిబ్బంది అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిపారని సింధ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ జావేద్ ఆలమ్ ఒఢో వెల్లడించారు. ఘటన ప్రారంభంలో భారీ పేలుడు సంభవించినప్పటికీ, అది ఎలా జరిగిందన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఘటనపై సింధ్ ముఖ్యమంత్రి మురాద్ అలీ షా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. దాడిపై సమగ్ర నివేదిక సమర్పించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. రెస్క్యూ 1122 బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఇది కరాచీలో గత అక్టోబర్ 2024 తర్వాత జరిగిన తొలి పెద్ద ఉగ్రదాడిగా అధికారులు చెబుతున్నారు. అంతకుముందు కరాచీ విమానాశ్రయం సమీపంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇద్దరు చైనా ఇంజినీర్లు మరణించారు. ఆ దాడికి బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత వహించింది. ఇక టీటీపీ తరఫున కరాచీలో చివరిసారిగా 2023 ఫిబ్రవరిలో కరాచీ పోలీస్ కార్యాలయంపై దాడి జరిగింది. ఇటీవల పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. అఫ్గానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం టీటీపీ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ తరచూ ఆరోపిస్తోంది. మరోవైపు టీటీపీ స్థావరాలపై అఫ్గాన్ భూభాగంలో పాకిస్థాన్ సైన్యం దాడులు కూడా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో కరాచీ దాడి అనంతరం భారత్‌పై పాకిస్థాన్ ఆరోపణలు చేయగా, వాటిని భారత్ పూర్తిగా తోసిపుచ్చి, ఉగ్రవాద సమస్యను ముందుగా తమ దేశంలోనే పరిష్కరించుకోవాలని స్పష్టమైన సందేశం ఇచ్చింది.

# నాకు చావంటే భయం లేదు- ఈ ఏడాదే బంగ్లాదేశ్‌కు వెళ్తాను

### మొదటి పేజీ తరువాయి



**-షేక్ హసీనా, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని**

వ్యక్తిగత ఆశయానికి సంబంధించిన విషయం కాదన్నారు షేక్ హసీనా. అధికారం కోసం తాను రాజకీయాలు చేయలేదని చెప్పారు. బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసమే రాజకీయాలు చేస్తానని స్పష్టం చేశారు. చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన, రాజకీయ ప్రేరేపిత ప్రక్రియలో భాగంగా తనపై న్యాయవ్యవస్థను రాజకీయ ప్రతీకార సాధనంగా వాడుకున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలు గతంలోనూ జరిగాయని అప్పుడు అవి విఫలమయ్యాయని అన్నారు. ఇప్పుడు కూడా విఫలమవుతాయని వెల్లడించారు. "నేను చావుకు భయపడను. 1975లో నేను నా తల్లిదండ్రులు, సోదరులు సహా నా యావత్ కుటుంబాన్ని కోల్పోయాను. ప్రజల ఓట్లతో ఐదుసార్లు బంగ్లా ప్రధాని అయ్యాను. దేశాభివృద్ధికి కృషి చేశాను. నా జీవితం దాదాపుగా బంగ్లా ప్రజలు, అవామీ లీగ్, ప్రజాస్వామ్య పోరాటం, దేశాభివృద్ధికి అంకితమైంది. అందుకే నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను. ప్రతి అడ్డంకిని, ప్రతి కుట్రను అధిగమించి ఈ ఏడాదే బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తాను. అవామీ లీగ్ అనేది కేవలం కాగితాలకే పరిమితమైన సంస్థ కాదు. తన 77 ఏళ్ల ప్రస్థానంలో అనేక సార్లు దాడులకు గురైంది. రక్తపాతాన్ని ఎదుర్కొంది. నిషేధానికి కూడా గురైంది. కానీ ప్రతిసారీ ప్రజల శక్తితో అది తిరిగి పుంజుకుంది. మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవిశ్రాంతంగా కృషి చేశాం. బంగ్లాదేశ్ వ్యతిరేక శక్తులు ప్రజల్లోని ఒక వర్గాన్ని తప్పుదోవ పట్టించి కుట్రపూరితమైన, పకడ్బందీగా రూపొందించిన ఉద్యమం ద్వారా అవామీ లీగ్‌ను అధికారానికి దూరం చేశాయి. వారు ఎన్ని చేసినా ప్రజల హృదయాల నుంచి అవామీ లీగ్‌ను చెరిపివేయలేకపోయారు."

**'బంగ్లా ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది'**

బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన లేదని షేక్ హసీనా ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వేధింపులను ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అవామీ లీగ్ రాజకీయాలు ప్రతీకారం కోసం కావని హక్కులు, భద్రత, గౌరవం, అభివృద్ధికి సంబంధించినన్నారు. అవామీ లీగ్ రాజకీయ పునరుజ్జీవనం ఏ ప్రభుత్వం దయపైనో ఆధారపడి లేదన్నారు. అది ప్రజలపై ఆధారపడి ఉందని చెప్పారు. అవామీ లీగ్ సంస్థాగత బలానికి ప్రస్తుత బంగ్లా సర్కార్ భయపడుతోందని అన్నారు. అందుకే అవామీ లీగ్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రభుత్వం సైన్యం, బీజీబీ (బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్), పోలీసులను రంగంలోకి దించిందని గుర్తు చేశారు. ఇది ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని ఆరోపించారు. బలప్రయోగంతో అవామీ లీగ్‌ను అణచివేయలేరని పేర్కొన్నారు.

**రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి : షేక్ హసీనా**

"బంగ్లాదేశ్‌లో సరైన ప్రజాస్వామ్య వాతావరణం, స్థిరత్వం నెలకొనాలంటే అవామీ లీగ్‌పై ఉన్న అక్రమ నిషేధాన్ని ఎత్తివేయాలి. తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలి. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి. శాంతియుత రాజకీయ కార్యకలాపాలను అనుమతించాలి. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటూనే ఉంది. ప్రజల్లో పేరుకుపోతున్న ఆగ్రహం, బాధ, ప్రజాస్వామ్య ఆకాంక్షలు అవామీ లీగ్‌కు ఒక కొత్త మార్గాన్ని సృష్టిస్తాయి. సైనిక పాలన, వివక్ష, అణచివేత, మతతత్వ రాజకీయాలు, ప్రజాస్వామ్య నిరాకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ద్వారా బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. 2024 ఆగస్టు 5 తర్వాత బంగ్లా విమోచన యుద్ధ స్ఫూర్తిపై దాడి జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులను చెప్పుల దండలతో అవమానించారు. దేశవ్యాప్తంగా విమోచన యుద్ధవీరుల స్మారక చిహ్నాలను ధ్వంసం చేశారు. జై బంగ్లా నినాదాన్ని ఒక నేరంగా పరిగణించారు. జాతిపిత నివాసంపై పదేపదే దాడులు జరిగాయి. మైనారిటీ వర్గాలపై దాడులు జరిగాయి. దేవాలయాలను ధ్వంసం చేశారు. సూఫీ మందిరాలు, సాంస్కృతిక సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. తీవ్రవాదం వ్యాప్తి చెందడానికి ఆస్కారం కల్పించారు" అని షేక్ హసీనా పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఆపలేని ఆ ఐదు అంటే భయం!

భారతీయ సమాజం మారుతోంది. అనూహ్య వేగంతో మారుతున్న సామాజిక ధోరణులను, రాజకీయాలు పోతోన్న పోకడలను నేను చాలా సంవత్సరాలుగా నిశితంగా గమనిస్తున్నాను. ఒక పెద్ద మార్పుగా కనిపించేది కాలంలో తాత్కాలికమైనదిగాను, ప్రభావశీలతలో అప్రధానమైనదిగాను తేలిపోతుంది. కనిపించే ప్రతి మేఘమూ నిలబడి వర్షించదు. చిరుజల్లు వెదజల్లి సాగిపోతోంది. చెప్పవచ్చిన దేమిటంటే మన జీవనగంగలో ప్రతి ప్రవాహమూ లోతైనది కాదు. ఎండిపోతోన్న తావులు అందులో ఎన్నో ఉన్నాయి. భారతదేశ చరిత్రలో 1947 ఒక కీలక సంవత్సరం. అదొక కొత్త ఆరంభం. దరిమిలా మన జాతి జీవనంలో అనేక ప్రభావాలు, ప్రాబల్యాలను దేశప్రజలు గుర్తించారు. అయితే అవి చాలా వరకు స్వల్పకాల అద్భుతాలుగా మిగిలిపోయాయి. ఆరంభదశలో ఉన్న మార్పులు అనేకం విశాల ప్రజానీకం దృష్టికెక్కలేదు. అయితే ఈ మార్పులు సంఖ్యానేక భారతీయుల జీవితాలను మౌనంగా ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు గాంధీజీ మహాత్ముడిగా భాసించారు. ఎందరో ఆయన్ను దైవ సమానుడిగా గౌరవించారు. గాంధేయవాదుల సంఖ్య తక్కువేమీ కాదు. గాంధేయ జీవన విధానం, అహింస, సత్యాగ్రహం, చరఖా, పౌర ఉల్లంఘన మొదలైనవి గాంధీ అనంతరం రెండు దశాబ్దాలకు మించి మనగలగలేకపోయాయి. స్వాతంత్ర్యానంతరం శీఘ్ర పట్టణీకరణ పెరుగుదలను చాలా తక్కువ మంది ఊహించారు. మరింత తక్కువ మంది వాతావరణ మార్పును గుర్తించారు. అంతకంటే చాలా తక్కువ మంది సమాజం, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతి మధ్య సంకీర్ణ సంబంధాన్ని అర్థం చేసుకున్నారు. 'జోస్యం చెప్పడం ఒక కష్టసాధ్యమైన విషయం. ముఖ్యంగా భవిష్యత్తు గురించి అయితే' అని నీల్స్ బోర్ (ఇరవయో శతాబ్ది వైజ్ఞానిక విప్లవకారుల్లో అగ్రగణ్యుడు) అన్నారు. ఆయన తాత్విక హాస్యంలో సామాన్య వివేకం పరిపూర్ణంగా ఉన్నది. అయినప్పటికీ భవిష్యత్తు అనే నిషిద్ధ ప్రదేశాన్ని దర్శించేందుకు నేను సాహసిస్తున్నాను. మన సమాజ జీవితంలో అయిదు ధోరణులు క్రమ క్రమంగా శక్తిని, వేగాన్ని పుంజుకోవడాన్ని నేను గమనించాను. వాటిని నేను ఏవగించుకుంటున్నాను, కొన్నిటికి భయపడుతున్నాను కూడా. అయితే అవి ఆపడానికి వీలు లేనివి. ఎవరూ ఆపలేనివిగా కనిపిస్తున్నాయి. మన ప్రజాస్వామ్యం క్షీణిస్తోంది. ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కొరకు పాలనే ప్రజాస్వామ్యం. ఇది ఒక సార్వజనీన సత్యం. వ్యక్తులు స్వేచ్ఛగా జన్మిస్తారు. అనేక స్వేచ్ఛల విషయంలో వారికి స్వతస్సిద్ధ హక్కులు ఉంటాయి. ప్రజల హక్కులను గౌరవించి, వాటిని కాపాడే ప్రభుత్వమే ప్రజాస్వామిక ప్రభుత్వం.. ప్రజల హక్కులను పరిరక్షించి, వాటిని ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలోకి తీసుకువచ్చేందుకు స్వతంత్ర సంస్థలను నెలకొల్పడం ప్రజాస్వామ్య ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. ఈ కర్తవ్య నిర్వహణను సక్రమంగా పాటించని ప్రభుత్వం ప్రజాస్వామిక ప్రభుత్వం కానేరదు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ అంతకంతకూ తగ్గిపోతున్నాయని ఫ్రీడమ్ హౌస్, వీడెమ్ ఇనిస్టిట్యూట్, రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ మొదలైన సంస్థలు నిర్ధారిస్తున్నాయి. వివిధ సూచికల ఆధారంగా ఏ దేశాలు స్వేచ్ఛాయుతమైనవో, ఏ దేశాలు స్వేచ్ఛాయుతమైనవి కావో అవి వర్గీకరిస్తాయి. కేవలం ఎన్నికల నిర్వహణను మాత్రమే కాకుండా, కొన్ని నిర్దిష్ట ప్రమాణాల ప్రాతిపదికన అవి నిర్ణయానికి వస్తాయి. మొత్తం మీద ప్రజాస్వామ్య పాలన విషయంలో చాలా దేశాల స్కోరు అంతకంతకూ పడిపోతోంది. 2005లో భారత్ స్కోరు 77 కాగా అది ఇప్పుడు 6367 మధ్య ఉన్నది. భారత్ కేవలం ఒక 'ఎన్నికల ప్రజాస్వామ్యం' మాత్రమేనని వీడెమ్ అభిప్రాయపడింది. మన దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరగడం క్రమంగా తగ్గిపోతోంది. ప్రజాస్వామిక పాలనకు సంబంధించి ప్రపంచంలో మన స్థానం పడిపోతుండడం పట్ల భారత ప్రజలు కలతచెందడం లేదు. ప్రభుత్వాలు సమకూరుస్తున్న సంక్షేమ చర్యలకు వారు సంతృప్తి చెందుతున్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకిరావడం వారిని ఆనందపరుస్తోంది. ప్రజాస్వామిక పాలనలో చైనా స్కోరు చాలా సంవత్సరాల పాటు 9/100గా ఉన్నది. అయితే చైనా ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అన్ని అంతర్జాతీయ సంస్థల నివేదికలు ఘంటాపథంగా చెప్పాయి. భారత్ సైతం అదే మార్గంలోకి వెళ్లవచ్చు. దేశ ఆర్థికవ్యవస్థ ఆరోగ్యదాయకంగా ఉందని చెప్పగలమా? మన ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాలలో డ్యూపోలీ (ద్విస్వామ్యం ఒక మార్కెట్‌లో ఒక ఉత్పత్తి లేదా సేవను అందించేవి కేవలం రెండు ప్రధాన కంపెనీలు ఉండడం) లేదా ఒలిగోపోలీ (పరిమితస్వామ్యం ఒక మార్కెట్‌లో పెద్ద విక్రేతలు వేళ్ల మీద లెక్కపెట్టదగిన కొద్దిమంది మాత్రమే ఉండడం) ప్రాబల్యంలోకి వెళ్లిపోవచ్చు. విమానయానం, టెలీకమ్యూనికేషన్స్, సిమెంట్, స్టీల్, విద్యుత్, ఫార్మా, పెట్రోలియం, రక్షణ ఉత్పత్తులు, మైనింగ్, కిరాణం మొదలైనవి అందుకు నిదర్శనాలు. మిగతా రంగాలలో కూడా త్వరలోనే ఇదే తరహా ధోరణులు ప్రబలిపోవచ్చు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లు దాదాపుగా అంతరించిపోవచ్చు. ఎన్జీవో అణచివేతకు గురవుతాయి. మొత్తం మీద పరిస్థితులు పూర్తిగా గుత్తాధిపత్య సంస్థలకు అనుకూలంగా మారతాయి. పెట్టుబడి, శ్రమశక్తి మధ్య సమతౌల్యత యథావిధిగా పెట్టుబడికి అనుకూలంగా ఉండడమే కొనసాగుతుంది. ఆదాయ అసమానతలు మరింతగా పెరుగుతాయి. ఆర్థిక సమానత్వాలు అసాధ్యమైపోతాయి. వలసలు పెరిగిపోతాయి. అస్తిత్వాలు అర్థం కోల్పోతాయి. చాలా పెద్ద నగరాలు కాస్మోపాలిటన్ నగరాలుగా పరిణమిస్తాయి. భాషల, మతాల, సంస్కృతుల మేళవింపు నెలవులుగా ఆ మహానగరాలు వెలుగొందుతాయి.

# భవిష్యత్‌కు హీలియమే ఆధారం!




సాధారణంగా బెలూన్లలో ఉపయోగించే వాయువుగా తెలిసిన హీలియం- నవీన విజ్ఞానశాస్త్రం, ఆరోగ్య సంరక్షణ, అంతరిక్ష సాంకేతికత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వ్యూహాత్మక వనరు. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల నెలకొన్న సరఫరా అంతరాయాలు, ధరల పెరుగుదల హీలియం ప్రాధాన్యాన్ని స్పష్టంచేశాయి. హీలియం విశ్వంలో అత్యధికంగా లభించే రెండో మూలకం. అయినా, భూమిపై అత్యంత అరుదైన వనరుగా పేరుంది. ఇది యురేనియం, థోరియం వంటి రేడియో ధార్మిక మూలకాల క్షయం ద్వారా లక్షల సంవత్సరాల కాలంలో సహజవాయువు నిల్వలలో ఏర్పడుతుంది. దీన్ని కృత్రిమంగా భారీస్థాయిలో తయారు చేయడం కష్టం. హీలియం ఒకసారి వాతావరణంలోకి విడుదలైతే భూమి గురుత్వాకర్షణను దాటి అంతరిక్షంలోకి వెళ్లిపోతుంది. అందుకనే, వృథా అయిన ప్రతి హీలియం అణువు శాశ్వతంగా కోల్పోయిన వనరు కిందే లెక్క. ఈ లక్షణమే దీన్ని చమురు, సహజ వాయువుకన్నా విలువైన వ్యూహాత్మక వనరుగా మారుస్తోంది. దీని అసాధారణమైన శీతలీకరణ సామర్థ్యమే ముఖ్యమైన భౌతిక లక్షణం. ద్రవ హీలియం -269 డిగ్రీల సెల్సియస్‌దాకా ఉష్ణోగ్రతను తగ్గించగలదు. ఇంత తక్కువస్థాయి ఉష్ణోగ్రతలను సాధించగల మరో వాణిజ్యపరమైన వాయువు ప్రస్తుతం అందుబాటులో లేదు.

### దిగుమతులే దిక్కు

వైద్యరంగంలో హీలియం పాత్ర అత్యంత కీలకం. ఎంఆర్ఐ స్కానర్లు సూపర్‌కండక్టింగ్ అయస్కాంతాల సహాయంతో పనిచేస్తాయి. ఈ అయస్కాంతాలను అత్యల్ప ఉష్ణోగ్రత దగ్గర నిర్వహించడానికి ద్రవ హీలియం తప్పనిసరి. హీలియం సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఎంఆర్ఐ సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. సెమీకండక్టర్ పరిశ్రమలో, కంప్యూటర్ ప్రాసెసర్లు, మొబైల్ ఫోన్ చిప్‌లు, ఏఐ ప్రాసెసర్లు, డేటా సెంటర్ సర్వర్లు, ఆటోమొబైల్ ఎలక్ట్రానిక్స్ తయారీలోనూ హీలియందే కీలక పాత్ర. చిప్ తయారీలో వేఫర్లను చల్లబరచడం, చాంబర్లలోని మలినాలను తొలగించడం, లీకేజీ పరీక్షల నిర్వహణలో తోడ్పడుతుంది. ప్రతి అధునాతన జీపీయూ, ఏఐ సర్వర్, క్లౌడ్ డేటా సెంటర్ వెనక హీలియం వినియోగం ఉంది. అంతరిక్ష పరిశోధన సంస్థలు, రక్షణ ప్రయోగశాలలకు ఇదొక అనివార్యమైన వనరు. రాకెట్ ఇంధన ట్యాంకుల్లో ఒత్తిడిని నియంత్రించడం, ప్రయోగాలకు ముందు వ్యవస్థలను శుద్ధి చేయడం, ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకలలో లీకేజీ పరీక్షలు నిర్వహించడం వంటి పనుల్లో కీలకంగా పనిచేస్తుంది. 'సెర్న్' వంటి ప్రపంచ ప్రఖ్యాత పరిశోధన కేంద్రాల్లో సూపర్ కండక్టింగ్ అయస్కాంతాల నిర్వహణకూ ఈ వాయువు అవసరం. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో హీలియం భవిష్యత్ సాంకేతికతకు మూలస్తంభంగా నిలుస్తోంది. క్వాంటం ప్రాసెసర్లు అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల దగ్గరే సమర్థంగా పనిచేస్తాయి. ఇందుకోసం హీలియం-3, హీలియం-4 మిశ్రమాలతో పనిచేసే డైల్యూషన్ రిఫ్రిజిరేటర్లను ఉపయోగిస్తారు. హీలియం-3 భూమిపై అత్యంత అరుదుగా లభించేది కావడంతో, భవిష్యత్తులో దాన్ని చంద్రుడి ఉపరితలం నుంచి సేకరించే ప్రణాళికలు కూడా రూపొందుతున్నాయి. ఇది భవిష్యత్తు సాంకేతికతల అభివృద్ధి హీలియంపై ఎంతగా ఆధారపడి ఉందో సూచిస్తుంది. ప్రపంచ హీలియం ఉత్పత్తి కొద్ది దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. అమెరికా, ఖతార్, రష్యా, అల్జీరియా ప్రపంచ ఉత్పత్తిలో అధిక భాగాన్ని నియంత్రిస్తున్నాయి. ముఖ్యంగా ఖతార్ ప్రపంచ సరఫరాలో మూడింట ఒకవంతుకు పైగా వాటాను కలిగి ఉంది. పశ్చిమాసియాలో ఎలాంటి రాజకీయ, సైనిక ఉద్రిక్తత తలెత్తినా హీలియం సరఫరాపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. ఇటీవలి గల్ఫ్ యుద్ధ సంక్షోభంతో ఇది స్పష్టమైంది. ఖతార్‌లోని ప్రధాన ఉత్పత్తి కేంద్రాలకు ముప్పు ఏర్పడటం, హర్మూజ్ జలసంధిలో రవాణా అనిశ్చితి పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో హీలియం ధరలు వేగంగా పెరిగాయి. దేశీయంగా హీలియం ఉత్పత్తి దాదాపు లేకపోవడంతో భారత్ వందశాతం అవసరాలను దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. ఇండియా సాధారణంగా 7-10 రోజుల హీలియం నిల్వలను కలిగి ఉంటుంది. మనదేశంలో చాలా ఆసుపత్రులు ముందస్తు నిల్వలు, దీర్ఘకాలిక ఒప్పందాలు లేకుండా, తక్కువ స్థాయి నిల్వలతోనే నడుస్తుంటాయి. దీర్ఘకాలిక కొరత ఏర్పడితే కష్టమే. మనదేశంలో ఏఐ సెమీకండక్టర్ రంగాలను ప్రోత్సహిస్తుండటంతో డిమాండ్ ఏటా సుమారు 8శాతం చొప్పున పెరుగుతుందని అంచనా. ఇదంతా సరఫరా భద్రతపై ఆధారపడి ఉంది. దాన్ని ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

జాతీయ భద్రతకు ప్రాణావసరం

ప్రస్తుతం భారత్ సెమీకండక్టర్ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. దేశాన్ని గ్లోబల్ చిప్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ లక్ష్యాల సాధనకు విశ్వసనీయమైన హీలియం సరఫరా గొలుసు వ్యవస్థ అవసరం. జాతీయ క్వాంటం మిషన్, అంతరిక్ష కార్యక్రమాలు, అణు పరిశోధనల భవిష్యత్తు కూడా హీలియం లభ్యతపైనే ఆధారపడి ఉంది. అందుకని, భారత్ తక్షణమే వ్యూహాత్మక చర్యలు చేపట్టాలి. నిల్వలను ఏర్పాటు చేయాలి. ఆసుపత్రులు, పరిశోధన కేంద్రాలు, పరిశ్రమలలో హీలియం పునర్వినియోగ వ్యవస్థలను తప్పనిసరి చేయాలి. కృష్ణా-గోదావరి బేసిన్, రాజస్థాన్ ప్రాంతాల్లో హీలియం అన్వేషణను ప్రోత్సహించి దేశీయ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలి. దిగుమతుల కోసం ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా, అమెరికా, అల్జీరియా, ఆస్ట్రేలియా, టాంజానియా వంటి దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవాలి. ఆధునిక సాంకేతికతలకు అవసరమైన వ్యూహాత్మక ముడిసరకుల భద్రత కూడా ముఖ్యమేనన్న సంగతి గుర్తించాలి. హీలియంను పారిశ్రామిక వాయువుగా కాకుండా, సాంకేతిక స్వావలంబనకు, జాతీయ భద్రతకు కీలకమైన వ్యూహాత్మక వనరుగా గుర్తించడం అవసరం.

# ఉద్యోగులు ఏమి అడిగారు.. ప్రభుత్వం ఏమిస్తోంది?




ప్రభుత్వ ఉద్యోగులు గత కొన్ని సంవత్సరాలుగా తమకు రావాల్సిన వివిధ రకాల బెనిఫిట్స్ కోసం డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అంతర్గతంగా బహిర్గతంగా తమ నిరసనను సున్నితంగా తెలియజేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మాత్రం ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చడంలో ఏదో ఒక రకమైన కారణాలు చెబుతూ దాటవేస్తూ వస్తుంది. సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వాలు మారిపోతున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారం కాకుండా అలానే పెండింగులో ఉంటున్నాయి. ఉద్యోగుల సమస్యల చిట్టా గుట్టలుగా రోజు రోజుకు పెరిగి పోతుంది. ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ ఊరిస్తూ కాలాన్ని సాగదిస్తుంది తప్ప ఏ ఒక్క సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఆసక్తి చూపడం లేదు.

### ఏళ్ల తరబడి వేచి ఉండటం ఏం న్యాయం?

ఉద్యోగులు తమ నెల జీతాన్ని పొందుతున్నారు.. తప్ప మరి ఏ ఇతర బెనిఫిట్స్ రావాలన్నా వాటి కోసం సంవత్సరాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పైరవీలు కూడా చేసుకొని మూల్యం చెల్లించుకుంటున్నారు. పదవి విరమణ చేసిన ఉద్యోగుల పరిస్థితి అయితే మరి దయనీయం. వారు చివరికి న్యాయస్థానాలను కూడా ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది.

### పెరిగిన అంతరం..

ప్రభుత్వం సమయానుకూలంగా ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలు నెరవేరకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల ప్రభుత్వం ఉద్యోగుల మధ్య అంతరం పెరిగింది. తెలంగాణలో ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య పెరుగుతున్న అంతరం అనేది ప్రధానంగా ఆర్థిక సంక్షోభాలు, పాలనాపరమైన సంస్కరణలు, ఉద్యోగుల డిమాండ్ల నెరవే రికలో జాప్యం కారణంగా ఉత్పన్నమవుతోంది. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక వృద్ధిని సాధించేందుకు ప్రభుత్వోద్యోగులు రోజుకు అదనంగా ఒక గంట పాటు ఎక్కువ పనిచేయాలని ప్రభుత్వాధినేత చేసిన అభ్యర్థనపై ఉద్యోగ వర్గాల నుండి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

### ఇదో కొత్త రకమైన ఊరడింపు..

ఉద్యోగులు ఏది అడిగితే అదే ఇవ్వాలి గాని, ఇంకేదో ఇస్తామంటూ ముందుకు రావటం ఉద్యోగుల్లోనే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా తమకు రావాల్సిన పీఆర్సీ, డీఏ, మెడికల్ బిల్స్, జీపీఎఫ్ లోన్స్, టీజీఎల్ఐసీ లోన్స్ వంటి ప్రధానమైన ఆర్థిక అంశాలతో కూడిన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచితే, ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా ఉద్యోగుల ఆరోగ్య పథకం, బీమా పథకం అంటూ వారి మూల వేతనంలో ఒకటి పాయింట్ ఐదు శాతం కట్ చేసుకుని ఆరోగ్య పథకం కార్డు ద్వారా మెరుగైన చికిత్స అందిస్తున్నామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటుంది. ఇదేమి గతంలోని మెడికల్ రీయింబర్స్మెంట్ కంటే పెద్ద ప్రయోజనం చేకూరేదేమి కాదు.

### రిటైర్డ్ ఉద్యోగి మూలవేతనంలోనూ కట్..

సంపూర్ణ ఆరోగ్యంగా జీవించి పదవీ విరమణ చేసిన ఉద్యోగి నుండి కూడా అనివార్యంగా తన మూల వేతనం నుండి జీతాన్ని కట్ చేయడం అనేది సరైనది కాదు. ఉద్యోగులు ఇప్పుడు పొందుతున్న ప్రయోజనాల కన్నా గతంలో పొందిన ప్రయోజనాలే మెరుగని చెప్పక తప్పదు. ప్రభుత్వం ముందుగా చేయాల్సిన పని ఏంటంటే వారి ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన డిమాండ్లను వెంటనే పరి ష్కరించాలి. ఉద్యోగులకు ఇవ్వవలసిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలి, పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించి బకాయిలను విడతల వారీగా కాకుండా ఒకేసారి చెల్లించాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు.

### వేల కోట్ల రూపాయల బకాయి చెల్లించేనా?

ఉద్యోగ సంఘాల నాయకుల స్వార్థ ప్రయోజనాల వలన సగటు ఉద్యోగి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉద్యోగుల సమస్యల పట్ల వారికి సరైన అవగాహన లేకపోవడం లక్షలాది మంది ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు బకాయి పడి ఉంది. ఒక్కో ఉద్యోగికి లక్షలాది రూపాయలు బకాయి పడి ఉందంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో ఆర్థిక వనరుల సమతుల్యత లేక పోవడంతో, గతంలో డీఏ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరిగింది. బకాయిల కోసం ఉద్యోగులు నిరసనలు తెలపడం, ప్రభుత్వం వాటిని దశల వారీగా విడుదల చేయడం జరిగింది.


### సంఘాలపై పోతున్న నమ్మకం..

ఏండ్లు గడిచిపోతున్నప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో సంఘాలు, సంఘ నాయకత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయి. ప్రభుత్వాలు ఉద్యోగుల సమస్యలను ఇష్టం వచ్చిన పుడు మాత్రమే పరిష్కరిస్తాయి తప్ప ఉద్యోగ సంఘాల పోరాటాల వల్ల కాదు అని తేలిపోయింది. ఈ పరిణామాల వలన ఉద్యోగులు తమ సంఘాలను నమ్మకోకుండా ప్రత్యామ్నాయ సంఘాల వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### అవసరం ఒకటైతే, నిర్ణయం మరొకటా?

ప్రభుత్వం, ఉద్యోగులు ఏం కోరుకుంటున్నారో అదే ఇవ్వడానికి సిద్ధపడాలి కానీ ప్రభుత్వమే తానే సొంతంగా ప్రతి పాదనలు తయారు చేసుకొని ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఏదో చేస్తున్నామని చెప్పడం అనేది సరైనది కాదు. సమస్య, వారి అవసరం ఒకటి ఉంటే ప్రభుత్వం మరొక నిర్ణయం తీసుకుంటే ప్రయోజనం ఏముంటుంది? చెప్పుకోవడానికి నోటి మాటలు తప్ప ప్రయోజనం శూన్యం. ఉద్యోగుల అవ సరాలు వారి సమస్యలకు అనుగుణంగా నిర్ణయాలు తీసు కున్నప్పుడు మాత్రమే ఉద్యోగుల అవసరాలు తీరుతాయి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ప్రభుత్వం, ఉద్యోగులు వేరు వేరు కాదు. ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వానికి విజయాలు సాధించి పెట్టేది ఉద్యోగులే అన్న విషయాన్ని గుర్తించాలి.

# స్టాక్ మార్కెట్‌లో మస్క్ ప్రభంజనం!




స్పేస్‌ఎక్స్ షేర్లు మార్కెట్లోకి వచ్చిన వెంటనే ఆ సంస్థ విలువ 2 ట్రిలియన్ డాలర్లు దాటింది. దాంతో ఆ కంపెనీ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద కూడా సరికొత్త శిఖరాలను తాకి, అ తను ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించాడు. ట్రిలియన్ అంటే సుమారు 94 లక్షల కోట్ల రూపాయలు. అది 2025-26 సంవత్సరానికి భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు నాలుగో వంతు. లేదా, భారతదేశ అత్యంత సంపన్నుడు ముఖేష్ అంబానీ సంపదకు దాదాపు పది రెట్లు. మస్క్ సంపద ఆ స్థాయికి పెరుగడానికి కారణమైన స్పేస్ ఎక్స్ అసాధారణ మార్కెట్ విలువపై ప్రపంచవ్యాప్తంగా విశ్లేషకులు మల్లగుల్లాలు పడుతున్నారు. మార్కెట్ ఆపాదిస్తున్న విలువ ఆ కంపెనీ వాస్తవ స్థితిగతులను ప్రతిఫలిస్తున్నదా? లేక స్టాక్ మార్కెట్లలో తరచుగా కనిపించే అత్యుత్సాహానికి ఇది మరో ఉదాహరణ మాత్రమేనా? స్పేస్ ఎక్స్ సంస్థను మరో సాధారణ టెక్నాలజీ కంపెనీగానో లేదా రాకెట్లు ప్రయోగించే అనేక అమెరికా సంస్థల్లో ఒకటిగానో చూస్తే దాని విలువ అసంబద్ధంగానే అనిపిస్తుంది. కానీ, ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ గతంలో టెస్లా, పేపాల్, న్యూరాలింక్ వంటి దిగ్గజ బ్రాండ్ల ద్వారా సాధించిన విజయాలను, కంపెనీ దీర్ఘకాలిక ప్రణాళికలను పరిశీలిస్తే ఆర్థిక విపణులు ఆ కంపెనీకి ఎందుకు ఇంతటి విలువను ఆపాదిస్తున్నాయో కొంతవరకు స్పష్టమవుతుంది. ముఖ్యంగా, ఇటీవలి వరకు మన ఊహలకు కూడా అందని కొన్ని వ్యాపార అవకాశాలపై స్పేస్‌ఎక్స్ దృష్టి సారించడం పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షిస్తున్నది. గతంలో అంతరిక్ష ప్రయోగాలు అత్యంత ఖరీదైనవిగా ఉండేవి. వందల కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రయోగించిన రాకెట్, పని పూర్తయిన తర్వాత వృథాగా సముద్రంలో పడిపోయేది. తదుపరి ప్రయోగానికి మరో రాకెట్ నిర్మించాల్సి రావడంతో, ప్రభుత్వాలు, విశేష వనరులు కలిగిన కొన్ని బహుళజాతి సంస్థలకే అంతరిక్ష ప్రయోగాలు పరిమితమయ్యేవి. ఆ రంగం వ్యాపార స్వభావాన్ని స్పేస్‌ఎక్స్ పూర్తిగా మార్చేసింది. ప్రయోగం ముగిసిన తర్వాత రాకెట్‌ను తిరిగి భూమిపైకి దించి, దానిని పునర్వినియోగించే సాంకేతికతను విజయవంతంగా అమలు చేయడంతో ప్రయోగ వ్యయం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఉపగ్రహాల ప్రయోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. వాణిజ్య అంతరిక్ష ప్రయోగాల మార్కెట్లో స్పేస్‌ఎక్స్ దాదాపు 80 శాతం వాటాను కైవసం చేసుకున్నది. స్పేస్‌ఎక్స్ విలువకు కారణం రాకెట్ వ్యాపారం మాత్రమే కాదు. ఆ సంస్థ భవిష్యత్తు ఆదాయాల్లో సింహభాగం, స్పేస్ ఎక్స్ అంతర్భాగమైన స్టార్ లింక్ నుంచి రావచ్చని విశ్లేషకుల అంచనా. వేలాది ఉపగ్రహాలను భూ కక్ష్యలో ప్రవేశపెట్టి, ప్రపంచవ్యాప్తంగా సముద్రాలు, ఎడారులు, కొండ ప్రాంతాలు, గగనతలం, ధృవ ప్రాంతాలు, యుద్ధ ప్రభావిత ప్రాంతాలు ఇలా సంప్రదాయ టెలికాం నెట్‌వర్క్‌లు చేరుకోలేని మారుమూలలకు కూడా ఇంటర్నెట్ సేవలు విస్తరించాలన్నది స్టార్ లింక్ లక్ష్యం. ఈ బృహత్తర ప్రణాళిక విజయవంతమైతే, స్టార్ లింక్ కేవలం మరో టెలికాం సంస్థగా కాకుండా భౌగోళిక సంక్లిష్టతలకు అతీతంగా ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలు సమకూర్చే వ్యవస్థగా పరిణితి చెందే అవకాశం ఉన్నది. స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువలో, భవిష్యత్ ఆదాయ అవకాశాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రతిబింబిస్తున్నాయనే వాదనను తోసిపుచ్చలేం. ఉత్తరోత్తరా అవకాశాలు మెండుగా ఉన్న టెక్నాలజీ కంపెనీల విషయంలో ఇది అసాధారణం కాదు. అటువంటి కంపెనీల షేర్ల ధరలను మదింపు చేసేటప్పుడు, ప్రస్తుత ఆదాయాల కంటే భవిష్యత్తు ఆదాయాల ఆధారంగా చేసే లెక్కలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి న్యూయార్క్‌కు వెళ్లాలంటే, ఎంచుకున్న మార్గాన్ని బట్టి 15 నుంచి 20 గంటలు పడుతుంది. ఆ సుదీర్ఘ ప్రయాణానికి అధికమొత్తంలో ఇంధనం ఖర్చవుతుంది. కానీ మస్క్ ఎప్పట్నుంచో కలలు కంటున్న వ్యోమనౌక ఆధారిత ప్రయాణ వ్యవస్థ విజయవంతమైతే, అదే ప్రయాణం గంటలోపే పూర్తయ్యే రోజులు రావచ్చని విశ్లేషకుల ఆశాభావం. ప్రస్తుతం ఇది ఇంకా ఆలోచన దశలోనే ఉన్నది. కానీ కార్యరూపం దాల్చితే, విమానయాన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉన్నది. అందుకే స్పేస్‌ఎక్స్ భవిష్యత్తు అవకాశాల గురించి మాట్లాడేటప్పుడు ఈ రంగాన్ని కూడా మార్కెట్ వర్గాలు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాయి. అంతరిక్షానికి చేరుకొనే వ్యయం గణనీయంగా తగ్గుతుండటంతో, ఇప్పటివరకు దాదాపు ప్రభుత్వాలకే పరిమితమైన ఈ రంగంలో ముందు ముందు ప్రైవేట్ రంగ భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఆధునిక యుద్ధాల్లో ఉపగ్రహ కమ్యూనికేషన్లు, నిఘా వ్యవస్థలు, సురక్షిత డాటా నెట్వర్కులు అత్యంత కీలకంగా మారాయి. ఇంకా పూర్తిగా సమసిపోని ఐరోపా, పశ్చిమాసియాల్లో ఉద్రిక్తతలు ఈ వ్యవస్థల ప్రాధాన్యాన్ని మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. అందువల్ల అంతరిక్షం, జాతీయ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక రంగంగా కూడా వేగంగా రూపుదిద్దుకుంటున్నది. ఈ కారణంగానే అనేక ప్రభుత్వాల రక్షణ, గూఢచార్య విభాగాలు కూడా అంతరిక్ష పరిశోధనా రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. అయితే ఈ అంచనాలన్నీ ఏ మేరకు కార్యరూపం దాల్చుతాయో కాలమే నిర్ణయిస్తుంది. స్పేస్‌ఎక్స్ కు మార్కెట్ ఆపాదిస్తున్న అపారమైన విలువను అర్థం చేసుకోవాలంటే దాని ప్రస్తుత కార్యకలాపాలను మాత్రమే కాకుండా,

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.



పోలవరం, : పోలవరం మండలంలోని పి. అంకంపాలెం ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాలి శ్రీనివాస్, గుడేల్లి లక్ష్మీనారాయణ, బండారు అనిల్, సిరిబత్తుల స్వామి, గణేష్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గడువులోగా సర్ ప్రక్రియ పూర్తి చేయాలి.

**స్పెషల్ ఇంటెన్స్యూ రివిజన్ (సర్) ఓటు మ్యాపింగ్ ని పరిశీలించిన : ఎంపీడీవో సి,హెచ్ శ్రీనివాస్.**



పోలవరం, : కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న(సర్) ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ జాబితా కార్యక్రమం లో భాగంగా పోలవరం మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో ఐటిడిపి అధ్యక్షులు కోడి శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బి ఎల్ ఓ లు ప్రతి ఇంటింటికి తిరుగుతూ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిపక్షపాతంగా నిర్వహించాలని .అదేవిధంగా ప్రతి ఒక్కరు బి ఎల్ ఓ ల నుండి ఎమ్యునేషన్ ఫామ్ తీసుకొని తమ వివరాలను నమోదు చేసి ఓటు హక్కును పొందాలని. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటు హక్కును ఈ కార్యక్రమంలో పొందవచ్చునని తెలియజేశారు. ప్రతి అర్హుడైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ...

"ఆరోగ్యకరమైన బాల్యమేసమృద్ధి వంతమైన సమాజానికి పునాది."



పోలాకి/నరసన్నపేట: : పోలాకి మండలం, మబగాం ప్రాథమిక పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు ఎమ్మెల్యే స్వయంగా పల్స్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లలోపు బాలబాలికలకు పోలియో చుక్కల తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లలు పోలియో బారిన పడకుండా ముందుగానే పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. భారతదేశాన్ని పోలియోరహితంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ఎన్నో ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మనం చిన్నారులకు జీవితాంతం ఆరోగ్యాన్ని అందించగలుగుతామని, తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలంటే ఈ రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ బి. శ్రీనాథ్ విజకుమార్, పోలాకి పిఏసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, నీటి సంఘం అధ్యక్షులు ధర్మాన అమ్మనాయుడు ,కాయ రవి ,మెండ రమేష్ , జుత్తు రామారావు మరియు ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన పోలవరం ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్.




పోలవరం, : పోలవరం మండల కేంద్రంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదివారం పోలవరం ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు ఆయన పల్స్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు బాల, బాలికలకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి అధ్యక్షులు కోడి శ్రీనివాస్,ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కల వేయిద్దాం, పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం.

**చేగొండపల్లి హెల్త్ సెంటర్ నందు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన : ఏపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి.**





పోలవరం, : పోలవరం మండలంలోని చేగొండపల్లి గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలను పోలియో మహమ్మారి నుంచి కాపాడుకోవడానికి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందని పేర్కొన్నారు. పోలియో చుక్కలు వేసుకోలేని పిల్లలు ఎవరైనా ఉంటే ప్రతిఒక్కరిని గుర్తించి, వారికి కూడా పోలియో చుక్కలు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి అధికార ప్రతినిధి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కిల్లారి శ్రీనాథ్



కొత్తచెరువు : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజక వర్గం కొత్తచెరువు మండలం లో ప్రియతమ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కల కేంద్రం లో పాల్గొని ,నిండు జీవితానికి రెండు చుక్కలు పల్స్ పోలియో చుక్కలతో ప్రతి చిన్నారి ఆరోగ్యం మన బాధ్యత ఐదు సంవత్సరాల లోపు ఉన్నటువంటి ప్రతి చిన్నారులు రెండు చుక్కలు వేయించుకోవడం వల్ల జీవితాంతం రక్షణ కవచంగా పోలియో చుక్కలు ఉంటాయి పోలియో రపాత దేశంగా తీర్చిదిద్దాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ముందంజలో ఉండడం చాలా గర్వకారణం,,పోలియో చుక్కలు వేయిద్దాం చిన్నారుల భవిషత్ కి బాటలు వేయాలి అని టీడీపీ అధికార ప్రతినిధి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కిలారి శ్రీనాథ్ తెలియజేశారు

## గట్టుప్పల్‌లో అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు.. సర్పంచ్, స్థానిక విలేకరి పేర్లు ప్రచారంలోకి.. అధికారుల మౌనం అనుమానాలకు తావు

నల్గొండ ప్రతినిధి **(దిక్సూచి ప్రతినిధి):** : గట్టుప్పల్ మండలంలో అక్రమ వెంచర్ల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నా, అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామంలోని సర్వే నంబర్లు 158/అ1, 159/అ/1లో 1.20 గుంటలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా జరుగుతున్న ప్రచారం ప్రకారం, ఈ వెంచర్ల వ్యవహారంలో గ్రామ సర్పంచ్‌తో పాటు ఓ స్థానిక విలేకరి పేరు కూడా వినిపిస్తోందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. భూములను ఒకటి, రెండు గుంటల చొప్పున నాలా చేయించి, పూర్తి లేఅవుట్ అనుమతులు లేకుండానే అమాయక ప్రజలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గట్టుప్పల్ మండలం ఏర్పడిన తర్వాత భూముల ధరలు పెరగడంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను పక్కనబెట్టి భారీగా అక్రమ వెంచర్లకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి...

## అక్రమ వెంచర్లకు అండ ఎవరిది?



చట్టబద్ధమైన లేఅవుట్ అనుమతులు పొందాలంటే రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు, గ్రీన్ ఏరియా, ప్రజా అవసరాల కోసం స్థలం కేటాయించడం, ప్రభుత్వానికి నిర్దేశిత రుసుములు చెల్లించడం తప్పనిసరి. కానీ వీటిని పాటించకుండా ప్లాట్లు విక్రయించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం వాటిల్లుతోందని తెలుస్తోంది.

### మోసపోతున్న కొనుగోలుదారులు

అనుమతులు లేని వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు తర్వాత ఇంటి నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో జీవితాంతం కూడబెట్టిన డబ్బుతో స్థలం కొనుగోలు చేసిన వారు నష్టపోతున్న పరిస్థితి ఏర్పడుతోంది.

### విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలి..

అక్రమ వెంచర్లపై వస్తున్న ఆరోపణలు, స్థానికంగా జరుగుతున్న ప్రచారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారు ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇటువంటి దందాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## చిన్నారుల ఆరోగ్య రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ఐదేళ్ల లోపు ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేయించాలి అని తెలియజేసిన పూల శివప్రసాద్.



కొత్తచెరువు : దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్య భద్రతపైనే ఆధారపడి ఉంటుందని, ఐదేళ్ల లోపు ప్రతి బిడ్డకూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ పిలుపునిచ్చారు. పల్స్ పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తచెరువు పట్టణ పరిధిలోని ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూల శివప్రసాద్ మాట్లాడుతూ, పోలియో మహమ్మారిని దేశం మరియు రాష్ట్రం నుంచి పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పల్స్ పోలియో కార్యక్రమాలను నిర్వహిస్తోందని గుర్తుచేశారు. తల్లిదండ్రులు ఎలాంటి అశ్రద్ధ లేదా అపోహలకు లోనుకాకుండా తమ పిల్లల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒకప్పుడు దేశాన్ని పట్టిపీడించిన పోలియోను కేవలం నిరంతర చుక్కల మందు పంపిణీ ద్వారానే నియంత్రించగలిగామని, ఆ పట్టుదలను ఇలాగే కొనసాగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, ప్రభుత్వం నిర్వహించే ప్రతి పల్స్ పోలియో విడతలోనూ ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ మళ్లీ చుక్కలు వేయించడం సురక్షితమని, ఇది పిల్లల్లో రోగనిరోధక శక్తిని మరింత పటిష్టం చేస్తుందని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య, ఆరోగ్య రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సైతం కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలు అందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు.

## ఆఫర్ అంటే ఆశ పడొద్దు మోసపోవద్దు: ఎస్సై మణికంఠ



బ్రాహ్మణ కొట్కూరు : సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక వెబ్‌సైట్ ఆఫర్లను చూసి మోసపోవద్దని బ్రాహ్మణ కొట్కూరు ఎస్సై మణికంఠ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో కనిపించే ఆకర్షణీయమైన ఆఫర్ల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆశకు లోనవ్వకుండా, అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారానే సైబర్ నేరాల బారిన పడకుండా రక్షించుకోవచ్చని అన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ఇంటింటి సర్వే



మార్కాపురం, : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఓటరు జాబితాలోని వివరాలను పరిశీలించి, అర్హుల వివరాలను నమోదు చేశారు. జిల్లా కలెక్టర్ విజయ సునీత సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించారు. ప్రజలు అవసరమైన పత్రాలను అందించి సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## మార్కాపురం జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం




మార్కాపురం, : మార్కాపురం జిల్లా ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఆయన, ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చల్లా నాగరాజు ఆధ్వర్యములో త్వరలో ఉచిత అంబులెన్స్ సేవలు..



చాగాలమర్రి , : చాగలమర్రి భూమ కుటుంబం అండతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాన్య ప్రజలకు కానీ టిడిపి భూమా కార్యకర్తలకు , అన్ని విషయాల్లో సహకరిస్తూ ఎవరికి ఏ అవసరం వచ్చినా మా వంతు వారి కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా చాగలమర్రి మండల ప్రజలకు సవినయంగా తెలియజేస్తున్నానని నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ చల్లా నాగరాజు అన్నారు. త్వరలో భూమా కుటుంబం ఆశీస్సులతో చాగలమర్రి మండల ప్రజలకు అత్యవసర సమయాలలో అందుబాటులో చాగలమర్రి మండల పరిధిలో ఒక ఎమర్జెన్సీ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొని వస్తామని ఈ సందర్భంగా మన మండల ప్రజలకు తెలియజేస్తున్నాను. ఈ వాహనం సామాన్యులకు అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలకు అతీతంగా అందుబాటులో ఉండేలా చూస్తాము. అంతే కాకుండా చాగలమరి పట్టణంలో మా దృష్టికి వచ్చిన సిసి రోడ్లు , డ్రైనేజీలు , విద్యుత్ దీపాలు , ప్రజల వ్యక్తిగత సమస్యలు అన్నింటికీ చొరవ తీసుకొని చాగలమర్రి ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహుడు , మైనారిటీ నాయకులు బషీర్, కరీముల్లా , టిడిపి నాయకులు శివాలయం ధర్మకర్త వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కశినేని ఓబులేసు, శంకర్ సుబ్బారావు, దాదా పీర్, అబ్దుల్లా, రాళ్ల షరీఫ్, కామిశెట్టి మధు, రామతీర్థం, రంగనాయకులు, నాగార్జున, వీర మహీంద్ర, నారాయణ, దస్తగిరి, లాల్ భాష సమ్మద్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గృహిణుల శ్రమకు సుప్రీం ఆర్థిక గుర్తింపు

మోటార్ ప్రమాద మరణ కేసులలో నష్ట పరిహారాన్ని నిర్ధారించేటప్పుడు, గృహిణులు చేసే వేతనం లేని



గృహ శ్రమకు స్వతంత్ర ఆర్థిక విలువను కేటాయించాలని జూన్ 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ ప్రయోజనం కోసం నెలకు ₹30,000 కనీస ఊహాజనిత ఆదాయాన్ని అది నిర్ధారించింది. గృహిణులను "దేశ నిర్మాతలు"గా పరిగణిస్తూ, జస్టిస్‌లు సంజయ్ కరోల్, ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం, మోటార్ ప్రమాద క్లెయిమ్‌లలో "గృహ సంరక్షణ నష్టం" అనే పేరుతో నష్టపరిహారానికి ఒక ప్రత్యేక శీర్షికను సృష్టించి, ప్రతి మూడేళ్లకు ఈ మొత్తాన్ని 10% పెంచాలని ఆదేశించింది.

### వివాదం ఏమిటి?

పంజాబ్‌లో జరిగిన ఒక మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌కు సంబంధించిన అప్పీలులో ఈ తీర్పు వెలువడింది. 2001 నవంబర్‌లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో రేష్మా అనే మహిళ మృతి చెందడంతో, ఆమె భర్త ముగ్గురు పిల్లలు నష్టపరిహారం కోరుతూ మోటారు ప్రమాద క్లెయిమ్‌ల ట్రిబ్యునల్ (హీరాజు)ను ఆశ్రయించారు. 2003 డిసెంబర్‌లో, ట్రిబ్యునల్ ₹2.42 లక్షల నష్టపరిహారాన్ని మంజూరు చేసింది. దీనితో అసంతృప్తి చెందిన ఆ కుటుంబం పంజాబ్- హర్యానా హైకోర్టును ఆశ్రయించింది. 2024 డిసెంబర్‌లో, హైకోర్టు క్లెయిమ్ పిటిషన్ దాఖలు చేసిన తేదీ నుండి 7.5% వడ్డీతో పాటు నష్టపరిహారాన్ని ₹.43 లక్షలకు పెంచింది. మూడు నెలల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించకపోతే, వడ్డీ రేటును సంవత్సరానికి 9%కి, ఆరు నెలలకు మించి ఆలస్యమైతే సంవత్సరానికి 12%కి పెంచుతామని పేర్కొంది. మంజూరు చేసిన నష్టపరిహారం మొత్తంతో ఇంకా అసంతృప్తిగా ఉన్న ఆ కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

### గృహ కార్మికుల వేతనాన్ని ఎలా లెక్కించింది?

గృహిణి మరణించిన కేసులలో, ట్రిబ్యునల్స్, కోర్టులు "గృహ సంరక్షణ నష్టం" అనే శీర్షిక కింద నెలకు అదనంగా ₹30,000 మొత్తాన్ని మంజూరు చేయాలని కోర్టు పేర్కొంది. ఒక నిర్దిష్టమైన ఊహాజనిత ఆదాయం ఆధారంగా నష్టపరిహారాన్ని అంచనా వేసినప్పుడు, గృహిణులు ఎదుర్కొనే సహజమైన ప్రతికూలతను భర్తీ చేయడానికి ఈ మొత్తం ఒక కనీస ప్రమాణంగా ఉపయోగపడుతుందని తెలిపింది. గృహిణి ఇంటికి ప్రత్యక్షంగా ఆర్థిక సహకారం అందించని సందర్భాలలో, ₹30,000 మొత్తాన్ని "తాత్కాలిక" నెలవారీ ఆదాయంగా పరిగణించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతి మూడేళ్లకు ఒకసారి, సంచిత ప్రాతిపదికన దీనిని 10% చొప్పున పెంచాలని ఆదేశించింది. గృహిణి ఉద్యోగంలో కూడా ఉన్నట్లయితే, ఆమె నిరూపితమైన ఆదాయానికి అదనంగా ఈ శీర్షిక కింద నష్టపరిహారం మంజూరు చేయబడుతుంది.

### మానవ మూలధనానికి శిల్పులు..

వంట చేయడం, శుభ్రపరచడం, సంరక్షణ వంటి గృహిణులు చేసే సాధారణ ఇంటి పనులు, వేతన కార్మికులకు మద్దతు ఇవ్వడంలోనూ, ఆర్థిక ఉత్పాదకతను పెంచడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయని ఈ తీర్పు ఎత్తి చూపింది. అయినప్ప టికీ, జీడీపీ వంటి సాంప్రదాయ ఆర్థిక సూచికలలో ఈ తోడ్పాటును అరుదుగా పరిగణనలోకి తీసుకుంటారు. "ఉన్నత స్థాయి వ్యాపారవేత్తలు, విజయవంతమైన రాజకీయ నాయకులు, ప్రముఖ కళాకారులు, పేరున్న న్యాయవాదుల" వంటి వారి ఉన్నత సౌధాలు నిర్మించబడే పునాది రాళ్లను గృహిణులే వేస్తారని పేర్కొంటూ, ధర్మాసనం వారిని భారతదేశ "మానవ మూలధనానికి" శిల్పులుగా అభివర్ణించింది. మృతురాలి కుటుంబానికి చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని కోర్టు ₹62.78 లక్షలకు పెంచింది. ఈ పరిహారం కేవలం ఆమె ఇంటికి అందించిన సేవలను మాత్రమే కాకుండా, తల్లి ప్రేమ, భర్త తోడు, ఇతర ఆధారపడిన కుటుంబ సభ్యులకు లభించాల్సిన సంరక్షణ, సహాయం వంటి వాటి నష్టాన్ని కూడా ప్రతిబింబించాలని కోర్టు పేర్కొంది. గృహిణులు అధికారిక ఆదాయాన్ని సంపాదించరనే కారణంతో వారి సేవలకు ఆర్థిక విలువ లేదని భావించవద్దని కోర్టు గతంలో హెచ్చరించినప్పటికీ, గృహ సంరక్షణ నష్టాన్ని అంచనా వేయడానికి ఒక నిర్దిష్ట కనీస ప్రమాణాన్ని నిర్దేశించడం ఇదే మొదటిసారి.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815